క్లుప్తంగా

ప్లీడర్లకు సన్మానం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా కోర్టులో ఇటీవల నియమితులైన ప్రభుత్వ ప్లీడర్ ఎంఎస్ శ్రీహరి ఆచార్య, అసిస్టెంట్ లీడర్ యెండల ప్రదీప్‌లను శుక్రవారం గీతా భవన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం గీత భవనంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా గీత భవనం అధ్యక్షుడు ఎం ఎస్ నర్సింహ చారి మాట్లాడుతూ.. 33 ప్రభుత్వ విభాగాల శాఖలకు న్యాయ సలహాలు సూచన చేసే అవకాశం ప్రభుత్వ ప్లీడర్లకు ఉంటుందన్నారు. గీత భవనం న్యాయ సలహాదారుడుగా తాను సేవలందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నరేందర్ రావు షిండే, కార్యదర్శి మేడిచర్ల ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షుడు యోగ రామచంద్రం, కోశాధికారి ఆరెట్టి లక్ష్మీనారాయణ, బొడ్డు దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ముదిరాజ్ సంఘ కార్యాలయంలో విద్యార్థులకు శుక్రవారం సంఘం అధ్యక్షులు మొత్కు మాధవ్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. అధ్యక్షులు మాట్లాడుతూ.. సంఘం సభ్యులైన విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శీల రాము, సంయుక్త కార్యదర్శి ఈర్ల శేఖర్, ఉపాధ్యక్షులు బల్‌రాం, లక్ష్మీనారాయణ, కోశాధికారి చింతకుంట సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి వేముల దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు..



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్, టేబుళ్లను గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రామాలయ ట్రస్ట్ చైర్మన్ బచ్చు పురుషోత్తం గుప్తా విరాళంగా అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై నర్సింలు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఉప తహసీల్దార్ ప్రవీన్, సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, హైస్కూల్ హెచ్ఎం రాములు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం నీరజ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామ శివారులోని ఎదురుకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి(కొత్త తిరుపతి) ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 31 నుంచి ఆలయం వద్ద వార్షిక ఉత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు విన్నవించగా లైట్లు ఏర్పాటు చేయించారని సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్ శుక్రవారం తెలిపారు. సహకరించిన ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సార్వజనిక్ గణేశ్ మందిర్ వార్షికోత్సవం ముగింపు



నిజామాబాద్ సిటీ : నగరంలోని సార్వజనిక్ గణేశ్ మందిర్‌లోని గణనాథుడికి 39వ వార్షికోత్సవం పురస్కరించుకొని వేకువజామునే స్వామివారికి విశేష పంచామృత అభిషేకాలు, గోపూజ, జెండా వందనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారంతో వసంతోత్సవాలు ముగిశాయి.

వసంత పంచమి వేడుకలు



ధర్పల్లి: మండలంలోని దుబ్బాక గ్రామంలో శ్రీవిద్య పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలకలు, పాఠ్యపుస్తకాలను పాఠశాల కరస్పాండెంట్ సాయి కృష్ణ పంపిణీ చేశారు. సరస్వతీ మాత పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ గోజూరి నడిపి గంగాధర్, ఉపాధ్యాయులు మమత, కృష్ణవేణి, మానస, శ్వేత పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం

- యూనివర్సిటీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చుబోయిన శివ



తెయూలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలు తీర్చకుండా మంత్రి కేటీఆర్ ఏ మొహం పెట్టుకుని జిల్లా పర్యటనకు వస్తున్నారని, మంత్రి పర్యటనను కచ్చితంగా అడ్డుకుంటామని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చుబోయిన శివ పేర్కొన్నారు. శుక్రవారం తెయూ క్యాంపస్‌లో శివ మాట్లాడుతూ.. యూనివర్సిటీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, నూతనంగా బాలికల హాస్టల్ నిర్మించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, క్యాంపస్‌లో 3 వేల మంది పాల్గొనే సామర్థ్యం కల ఆడిటోరియాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. ప్రత్యేక తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబీకులే ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. ఎన్నికల ముందు మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి మాట్లాడుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏబీవీపీ ఇందూరు విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ ప్రమోద్ పాల్గొన్నారు. విద్యా హక్కు చట్టం అమలయ్యేలా చూడాలి

నిజామాబాద్‌అర్బన్: సంక్షేమ హాస్టళ్ల సమస్యలు తీర్చి, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుంటే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని ఏబీవీపీ నేతలు అన్నారు. శుక్రవారం నగరంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర ఇన్‌చార్జి బాలకృష్ణ, భూక్యా సాయి కుమార్, శశాంక్, ప్రణయ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌ను పెంచాలి: ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిజామాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించకుండా కేటీఆర్ జిల్లా పర్యటనకు రావడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్ మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొత్త హంగులతో ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు – మన బడి పథకం కింద అన్ని పాఠశాలలను చేర్చి అధికంగా బడ్జెట్ కేటాయించాలని అన్నారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను రూ. 3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

మహిళా డిగ్రీ కాలేజీ కేటాయించాలి :పీడీఎస్‌యూ

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు మహిళ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు అషుర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ నెల 28న మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, నిజామాబాద్‌లోని విద్యారంగ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేయడం ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. నగర ఉపాధ్యక్షులు మహిపాల్, నగర కోశాధికారి తిరుమలేష్ పాల్గొన్నారు.

సమగ్ర చట్టం అమలు చేయాలి

- మిగులు భూములను కూలీలకు పంచాలి
- ఏఐకేఎంఎస్ డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి(మోపాల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేయాలని, అన్ని రకాల ప్రభుత్వ మిగులు భూములను వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సాయాగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మోపాల్ తహసీల్దార్ లతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ.. పాలకుల తప్పుడు విధానాలు, విచ్చలవిడి పెట్టుబడి, యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయ కార్మికులకు నిజ వేతనాలు, పని దినాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. ఒక వ్యవసాయ కార్మికుడికి రోజుకు కనీసం రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఒక కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తారని, ఆశపడితే కనీసం 45 రోజులు పని కూడా కల్పించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. మోపాల్ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 449లో గల 13 ఎకరాల 17 గుంటల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాటిని వెంటనే అడ్డుకోవాలన్నారు. సర్వే జరిపి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను వేధించడం శోచనీయం



శ్రావణికి సంఘీభావం తెలుపుతున్న పద్మశాలీలు

నిజామాబాద్‌నాగారం/జక్రాన్‌పల్లి: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వేధించడం శోచనీయమని పద్మశాలి సంఘం జక్రాన్‌పల్లి మండల అధ్యక్షుడు శ్రీపతి శేఖర్, జిల్లా అధ్యక్షులు పులుగం హన్మండ్లు అన్నారు. శ్రావణికి పద్మశాలీలు అండగా ఉంటారని వారు అన్నారు. శుక్రవారం జిల్లాకు చెందిన పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జగిత్యాలకు వెళ్లి మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణిని కలిసి సంఘీభావం తెలిపారు. శ్రీపతి శేఖర్, పులుగం హన్మాండ్లు వేర్వురుగా మాట్లాడారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, బీసీ కులానికి చెందిన మహిళ నాయకురాలి ఎదుగుదలను ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. వెంటనే ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పద్మశాలి సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఆమె రాజీనామాను ఆమోదించకుండా తిరిగి చైర్మన్ పదవిలో కూర్చోబెట్టాలని, లేకుంటే రాష్ట్రం అగ్ని గుండం అవుతుందని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. స్థానిక ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా రాజ్‌కుమార్



నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది రాజ్ కుమార్ సుబేదార్‌ను నిజామాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లా న్యాయసేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆయనకు జిల్లా సంస్థ తరపున నియమాక పత్రాన్ని అందజేశారు. జిల్లా న్యాయసేవాసంస్థ సభ్యుడిగా, సంస్థ ప్రతి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. పాన్ ఇండియా లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. సామాజిక సేవలలో తనదైన ముద్ర వేశారు. నిజామాబాద్ బార్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. సుబేదార్ నియమాకం పట్ల బార్ కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేందర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కృపాకర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జె.వెంకటేశ్వర్, దాసరి పుష్యమిత్ర, ఎస్.సంతోష్, మంచికట్ల గోవర్ధన్ అభినందనలు తెలిపారు. డిప్యూటీ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా ఉదయకృష్ణ, శుభం, ప్రమోద్‌లను నియమించారు.

ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకమైంది

- ఆరిజోనా యూనివర్సిటీ శాస్త్రవేత్త గంగారెడ్డి



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న గంగారెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): మహిళల్లో వచ్చే ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకమైనదని అమెరికాలోని ఆరిజోనా యూనివర్సిటీ యువ శాస్త్రవేత్త గంగారెడ్డి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి– నివారణ ఔషధాలపై పరిశోధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా చిన్న వయసు గల మహిళల్లో కన్పిస్తుందన్నారు. మిగిలిన బ్రెస్ట్ క్యాన్సర్‌లు కీమోథెరపీ, రేడియేషన్, సర్జరీలతో తగ్గిపోయే అవకాశాలుండగా, ట్రిపుల్ నెగెటివ్ క్యాన్సర్ మాత్రం నయం కాకుండా ప్రాణాలను తీస్తుందన్నారు. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధులలో మిగిలిన వాటిని ప్రారంభంలోనే గుర్తించే అవకాశం ఉండగా ట్రిపుల్ నెగెటివ్ క్యాన్సర్‌ను గుర్తించే సరికి ఫైనల్ స్టేజిలో ఉంటుందన్నారు. బ్రెస్ట్‌క్యాన్సర్ వచ్చిన మహిళల్లో 20 శాతం మంది దీనివల్లనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం ఆరిజోనా యూనివర్సిటీలో తమ బృందం ప్రత్యేక ఔషధ తయారీ ప్రాజెక్టును చేపట్టినట్లు వెల్లడించారు. తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు విదేశాల్లో రీసెర్చ్ చేయాలనుకుంటే తన వంతు సహాయ సహకారాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం తెయూ కెమిస్ట్రీ విభాధిపతి జి.బాలకిషన్ మాట్లాడుతూ.. గంగారెడ్డి నిజామాబాద్ జిల్లా పోచంపల్లి వాస్తవ్యులని, క్యాన్సర్ పరిశోధనలో ఎంతో ప్రావీణ్యం సాధించారని తెలిపారు. అనంతరం గంగారెడ్డిని సన్మానించారు.

'కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం'



మోపాల్: మంచిప్ప రిజర్వాయర్ ముంపు కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపారని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మంచిప్పలో శ్రీనివాస్‌యాదవ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిప్పకు రాజకీయం చేయడానికి రాలేదని, కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించేందుకే వచ్చానన్నారు. అక్రమ కేసులను తీవ్రంగా ఖండించారు. నాయకులు స్వామియాదవ్, రవి, గంగాధర్ యాదవ్, తదితరులున్నారు.

చట్టబద్ధత కల్పించకపోతే ఘోరీ కడతాం



సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే బీజేపీకి ఘోరీ కడతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య పేర్కొనారు. శుక్రవారం నగరంలోని సందీప్ గార్డెన్లో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేస్తామని బీజేపీ నేతలు అనేక సమావేశాల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పుడు వర్గీకరణ విషయం మర్చిపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా గలిగిన మాదిగలకు దళిత బంధు పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బాబురావు, నాంపల్లి శ్రీనివాస్, మోహన్, పోసాని, విద్యాసాగర్, మహేశ్వరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు అందుబాటులో ఉండటం లేదు'



బీజేపీ నేత న్యాలం రాజు

నిజామాబాద్‌నాగారం: కార్పొరేషన్‌లో ముఖ్యమైన విభాగాలలో ఇన్‌చార్జి అధికారుల ఆధ్వర్యంలో పాలన సాగుతోందని, కార్పొరేషన్ ద్వారా కనీస సౌకర్యాలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు పేర్కొన్నారు. కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై కార్యాలయానికి వెళితే ఇన్చార్జి అధికారులు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. నగరాభివృద్ధికి కూడా ఆటంకం కలుగుతుందన్నారు. కార్పొరేషన్ సేవలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌ను ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని మెట్టుమర్రితండా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ మాన్‌సింగ్ శుక్రవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి జిల్లా పరిషత్ ద్వారా రూ.5 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు బాల్‌సింగ్, ఉపసర్పంచ్ జగన్, నౌసీలాల్, రాములు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,200	వెండి (కిలో)	71,000
22 క్యారెట్స్	53,650	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	25	40
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	35	50	గోబిపువ్వు	15	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

జిల్లా కోసం కొనసాగుతున్న దీక్షలు

బోధన్: ప్రత్యేక జిల్లా డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శుక్రవారం నాటికి దీక్షలు 40వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షలో గోసంగి కుల సంఘం డివిజన్ కమిటీ నాయకులు, సభ్యులు కొండపల్లి గంగాధర్, వీరేశం, గంగాధర్, పీరయ్య, లక్ష్మణ్, రాములు, ప్రకాష్, ఎల్లప్పలు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్–1– పఠాన్ (హిందీ)–1.20,4.25, 7.30,10.40
స్క్రీన్–2–వాల్తేరు వీరయ్య–10.20
వీరసింహారెడ్డి –1.20,10.30
వారసుడు– 4.25
హంట్–(తెలుగు),7.40
స్క్రీన్–3– వాల్తేరు వీరయ్య –1.30,4.30,7.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1 –పఠాన్ – (హిందీ),9.30,12.45 4.00,7.15,10.30
స్క్రీన్–2 పఠాన్–(హిందీ)–10.00,1.15 7.45,11.00 –పఠాన్–(తెలుగు).4.30
స్క్రీన్–3 వాల్తేరు వీరయ్య –10.15,1.35 4.55,7.20,10.40
స్క్రీన్–4– హంట్–(తెలుగు),10.15,10.50
మల్లికాపురం(తెలుగు),1.15
వీరసింహారెడ్డి,3.50
వారసుడు,7.20
దేవి వీరసింహారెడ్డి
నటరాజ్ పఠాన్(హిందీ)
లలితామహల్ వాల్తేరు వీరయ్య
శ్రీదేవి ధమాకా
విజయ్ పఠాన్ (తెలుగు)

'చలో ఎస్‌పీడీ ముట్టడి' విజయవంతం చేయండి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

డిచ్‌పల్లి: కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 30న జరుగనున్న చలో 'ఎస్‌పీడీ (స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్) కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం డిచ్‌పల్లి కేజీబీవీలో చలో ఎస్‌పీడీ ముట్టడి కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత పథకాలు అమలు కావడం లేదన్నారు. వీరంతా శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. తక్షణమే జీవో–60ని అమలు చేయాలన్నారు. కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన కేజీబీవీల్లో కుక్, స్వీపర్, అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి, కేజీబీవీ సిబ్బంది సుజాత, పద్మ, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: ఆత్మహత్యలతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, టీఎన్జీవో సభ్యులు అండగా ఉంటారని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన రమణారావు సంస్మరణ సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలుక కిషన్ హాజరై మాట్లాడారు. ఉద్యోగ విధుల్లో గాని, వైవాహిక జీవితంలో గానీ ఒత్తిడికి గురై జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకోవద్దన్నారు. టీఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి అమృత్ కుమార్, నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లు బద్రినాథ్, యశస్విని, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై రమణరావు చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఆకు ముడత తెగులు నివారణకు చర్యలు



పంటలను పరిశీలిస్తున్న డీఏవో తిరుమల ప్రసాద్

ఇందల్వాయి: క్షేత్ర స్థాయిలో పంట వివరాల నమోదు, పరిశీలనలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. గ్రామంలో అత్యధికంగా సాగైన వరిని పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కాండం తొలుచు, ఆకు ముడత నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల లీటరు నీటికి లేదా క్లోరాంతనిలిప్రోల్ ఎకరాకు 60 ఎంఎల్ మందులను పైరు పూర్తిగా తడిచేలా సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు అవగాహన లేకుండా ఇష్టారీతిన పురుగు మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడం, దిగుబడులు తగ్గడం వంటి నష్టాలు ఉంటాయన్నారు. రైతులు, వ్యవసాయ అధికారులు చేసిన సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. ఇన్‌చార్జి ఏవో ప్రవీణ్ కుమార్, ఏఈవో శ్రీహరి ఉన్నారు.